## క్లుప్తంగా

### వేంకటేశ్వరునికి జన్మనక్షత్ర పూజలు


ఆలయంలో స్వామివారి వ్రతం చేస్తున్న భక్తులు


కరప: యండమూరులో ఉన్న సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసం శనివారం స్వామివారి జన్మ నక్షత్రం శ్రవణం కావడంతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేవారు. భక్తులో వేంకటేశ్వరస్వామి వ్రతాలు చేయించారు. యండమూరు, పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి, వ్రతాలు చేయించుకుని, స్వామివారిని దర్శించుకున్నారు. కరప విష్ణ్వాలయంలోని వేంకటేశ్వరస్వామికి అర్చకుడు పెద్దింటి అనంతాచార్యులు స్వామివారికి జన్మనక్షత్ర పూజలు చేశారు.

### బాలదాసులతో శ్రీవారి వ్రతపూజ


భోగిగణపతి పీఠంలో శ్రీవారి జపయజ్ఞ పారాయణలో పాల్గొన్న భక్తులు

బోట్‌క్లబ్: పూర్ణహృదయ ఆరాధనతో వేంకటేశ్వర స్వామి వ్రతాన్ని నిర్వహించడం బాలదాసులకే సాధ్యమని గణపతి పీఠం వ్యవస్థాపకులు రమణరాజు అన్నారు. శ్రీవారి 58వ జప యజ్ఞ పారాయణ సందర్భంగా కాకినాడ సూర్యారావు పేట దూసర్లపూడి వారి వీధిలోని స్వయంభూ భోగి గణపతి పీఠంలో శనివారం ఉదయం సుప్రభాత వేళలో బాలదాసులతో వ్రతపూజ నిర్వహించారు. పంచామృతాలతో విఘ్నేశ్వర దామోదర వేంకటేశ్వరస్వామి వార్లకు అభిషేకం నిర్వహించి సప్తగిరుల కలశ ప్రతిష్ఠ శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి సహస్ర నామ పారాయణ, గోవింద నామ సంకీర్తనలతో మంగళ హారతులు అందించారు. ఈ నెల 11న కార్తిక వన హారతి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు లక్ష్మీమంగతాయారు, నూకరత్నం, వెన్నెల, సౌజన్య, శ్రావణి, మణి ప్రియాంక, మాధురి, శశిరేఖ, పాపారావు పాల్గొన్నారు.

### అయ్యప్పస్వామికి అభిషేకాలు


అయ్యప్పస్వామి వారికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

బోట్‌క్లబ్: స్థానిక పేర్రాజుపేటలోని ఎస్‌వీ సాయిబాబా గురుస్వామి పీఠంలో శనివారం అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి ఆవుపాలు, ఆవుపెరుగు, పాలు, పంచాదార, విభూది, తేనే, కొబ్బరినీళ్లతో అభిషేకాలు చేశారు. అనంతరం అష్టోతర పూజ చేశారు. అయ్యప్పస్వామి శరణుఘోషతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వాములు ఈశ్వర్, వీరభద్రరావు, సతీష్ పాల్గొన్నారు.

### రోడ్లపై పశువులతో తప్పని అవస్థలు

బోట్‌క్లబ్: నగరంలో విచ్చలవిడిగా రోడ్లుపై పశువులు సంచరించడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు వాపోయారు. పార్కుల సమీపంలో తెల్లవారుజామున వాకింగ్ వేళ్లే సీనియర్ సిటిజన్లు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుంపులుగా తిరుగుతూ రోడ్డుపై నడిచివెళ్లే వారిపై దాడి చేస్తున్నాయని, శనివారం ఉదయం స్థానిక రామారావుపేట మూడు లైట్ల సెంటర్లలో వాకర్‌పై పశువుల దాడి చేయడంతో అతను ఆసుపత్రి పాలవ్వాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రోడ్లపై పశువులను వదిలే వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాత్రీ పగలూ తేడా లేకుండా కార్పొరేషన్ రోడ్లపై పశువులు వదిలేయడంపై అధికారులు దృష్టి సారించాలని కోరారు.

### నిత్యావసరాల పంపిణీ


సరకులు అందజేస్తున్న కోరమండల్ మహిళా క్లబ్ సభ్యులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో కోరమండల్ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరకులు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి మల్లీశ్వరి మాట్లాడుతూ తమ సంఘం తరపున ప్రతి నెలా నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి కృష్ణమోహన్, ఆలీ అవర్, లక్ష్మి సృజన, మోహిని కుమారి, రేలంగి బాపిరాజు, చింతపల్లి సుబ్బారావు, రాజా తదితరులు పాల్గొన్నారు.

# సర్వీస్ రోడ్లు నిర్మించండి

- స్పీడ్ బ్రేకర్లు లేక తరచూ ప్రమాదాలు
- వంతెన నిర్మించి ఏడాది అవుతున్నా పూర్తి కాని పనులు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు


రామారావుపేట-కొండయ్యపాలెం బ్రిడ్జి


చిన్నపాటి వర్షం వస్తే చెరువులా మారిన మట్టి రోడ్డు


గతుకుల మట్టి రోడ్డు

కాకినాడ లీగల్: రామారావుపేట-కొండయ్యపాలెం ఫ్లైఓవర్ ప్రారంభించి ఏడాది గడచినా సమస్యలు మాత్రం ఎక్కడివక్కడే ఉన్నాయి. వంతెనకు అటు ఇటు సర్వీస్ రోడ్లు వేయకపోవడంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఈ రామారావుపేట-కొండయ్యపాలెం బ్రిడ్జిని మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో నిధులు మంజూరు చేసి ప్రారంభించారు. ఆయన మరణం అనంతరం వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోలేదు. సరైన రోడ్లు లేకపోవడంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులతో ప్రయాణికులు అవస్థలకు గురయ్యేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బ్రిడ్జి నిర్మాణం పునర్నిర్మాణానికి గత ఏడాది ముత్తా వారధిగా నామకరణం చేసి ప్రారంభించారు. అయితే బ్రిడ్జి ఇరువైపుల స్థానిక ప్రాంతాలను ఆనుకుని ఉన్న రహదారిని కలుపుతూ రోడ్లు నిర్మించాల్సి ఉంది. ఈ రహదారులు నిర్మించకపోవడంతో చిన్నపాటి వర్షం వస్తే చాలు చెరువుల్లా మారిపోవడంతో ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షాలకు ఈ రహదారులు మురికి కూపంగా మారిపోవడంతో స్థానికంగా నివసించే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే రామారావుపే -కొండయ్యపాలెం బ్రిడ్జికి కొండయ్యపాలెం వైపు స్పీడ్ బ్రేకర్ వేశారు కానీ, రామారావుపేట వైపు లేకపోవడంతో వేగంగా వస్తున్న వాహనాలతో నాలుగు రోడ్ల జంక్షన్‌లో ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జికి ఇరువైపులా రోడ్లు, స్పీడ్ బ్రేకర్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

#### మట్టి రోడ్డుతో ఇబ్బంది



రామారావుపేట-కొండయ్యపాలెం బ్రిడ్జి ప్రాంతంలో పదేళ్ల నుంచి ఉంటున్నాం. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. బ్రిడ్జి నిర్మాణం ఎట్టకేలకు జరిగినప్పటికీ బ్రిడ్జికి ఇరువైపులా రోడ్లు నిర్మించకపోవడంతో వర్షాకాలంలో ఇబ్బంది పడుతున్నాం. మట్టి రోడ్డుగా ఉన్న ఈ రోడ్డు గోతులమయం కావడంతో వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లు నిర్మించాలి.

– బసవా చంద్రమౌళి, మాజీ కార్పొరేటర్, స్థానికుడు

#### తరచూ ప్రమాదాలు



రామారావుపేట వైపు దిగే బ్రిడ్జికి స్పీడ్ బ్రేకర్లు వేయాలి. బ్రిడ్జి డౌన్‌లో శివాలయం జంక్షన్ ఉండడంతో స్పీడ్‌గా వచ్చే వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. తరచూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు వేయాలి. బ్రిడ్జికి ఇరువైపులా రహదారిని నిర్మించాలి.

– బదుగు బాబూ రాజేంద్రప్రసాద్, న్యాయవాది, స్థానికుడు

## భక్తిశ్రద్ధలతో పాల కావడి పూజ


వేళంగిలో ఊరేగుతున్న అయ్యప్పస్వామి భక్తులు


పాల కావడి ఉత్సవాన్ని జరుపుతున్న అయ్యప్పస్వాములు

కరప: తమిళనాడు పళని సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి నిర్వహించే పాల కావడి ఉత్సవం తరహాలో వేళంగి గ్రామంలో శనివారం అయ్యప్పస్వామి భక్తుడు బదిరెడ్డి వెంకన్నస్వామి ఆధ్వర్యంలో 508 మంది అయ్యప్పస్వాము పాల కావడి ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దీంతో వేళంగి అయ్యప్పస్వామి నామస్మరణతో మార్మోంగి. కాకినాడ, వేళంగి పరిసర గ్రామాలకు చెందిన 508 మంది అయ్యప్ప స్వాములు పాల కావడిని భుజాలపైకెత్తుకుని రాగా ఊరేగింపుగా తుల్యభాగ నదీతీరాన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. ఈ ఊరేగింపులో శివ, పార్వతులు, కుమారస్వామి, వెంకటేశ్వరస్వామి తదితర దేవతామూర్తుల వేషధారణలు, బాలికల కోలాటం, మేళతాళాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆలయంలోని స్వామివారికి పాల కావడిలో పాలతో అభిషేకించారు. స్వామివారి సన్నిధిలో బదిరెడ్డి వెంకన్నస్వామి, వీరలక్ష్మి, మనులతో ఎస్.కుమార్ వేల్ గురుస్వామి, డి.మాధవకృష్ణ గురుస్వామి మహాగణపతి హోమం, అయ్యప్ప స్వామి అష్టోత్తరపూజ, అభిషేకం వంటి పూజాదికాలు నిర్వహించి పంచహారతులు ఇచ్చారు. ఈ పాల కావడి మహోత్సవాన్ని తిలకించేందుకు అయ్యప్పస్వాములు తరలివచ్చారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తదితర ప్రజాప్రతినిధులు అయ్యప్పస్వామి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నసమారాధన నిర్వహించారు.

## ప్రాథమిక హక్కులపై అవగాహన


సదస్సులో పాల్గొన్న రాజీవ్‌గాంధీ లా కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, ఏపీ బార్‌కౌన్సిల్ సభ్యుడు తదితరులు

సూర్యారావుపేటలో రాజీవ్‌గాంధీ లా కళాశాల విద్యార్థుల అవగాహన సదస్సు

కాకినాడ రూరల్: మత్స్యకార గ్రామం సూర్యారావుపేటలో శనివారం రాజీవ్‌గాంధీ లా కళాశాల విద్యార్థులు ప్రాథమిక హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు నరహరిశెట్టి రవికిశోర్ పాల్గొని గ్రామ ప్రజల ప్రాథమిక హక్కులను తెలియజేశారు. చట్టపరంగా ప్రాముఖ్యత గురించి వివరించారు. రాజీవ్ గాంధీలా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ విద్యార్థులు, సిబ్బందితో ఉచితంగా లీగల్ సెల్ నిర్వహిస్తున్నామని దాని ద్వారా గ్రామస్తులు చట్టపరంగా సలహాలు, సూచనలు పొందవచ్చన్నారు. సీనియర్ ప్రొఫెసరు జంపన ప్రసాద్ మాట్లాడుతూ సాధారంగా చట్ట విధానాలు తెలుసుకుని అవగాహన పెంపొందించుకోవాలన్నారు. మోటార్ వెహికల్ యాక్ట్‌పై విద్యార్థిని సత్యశ్రీ, పాస్కో చట్టం, చైల్డ్ అబ్యూస్ యాక్ట్‌పై విద్యార్థిని సుగుణ గంగ, కార్మిక చట్టంపై విద్యార్థిని భారవి, ఉమెన్ ప్రొటెక్షన్ యాక్ట్‌పై సుకన్య, విజయ్‌కుమార్, వినియోగదారుల రక్షణ చట్టంపై లిఖిత, సైబర్ క్రైమ్ విద్యార్థిని అనుష్క, ప్రాథమిక చట్టం హక్కుపై అభిషేక్, ఎఫ్ఐఆర్‌పై విజయ్, నిగోసిబుల్ ఇన్‌స్ట్రుమెంట్ యాక్ట్‌పై శ్రీదేవి, భూ వివాదాలపై శశికళ అవగాహన కల్పించారు.

## కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలి


గాంధీభవన్‌లో నిర్వహించిన ఉన్నతి స్కిల్ సెంటర్ వీడ్కోలు కార్యక్రమం

బాలాజీచెరువు: ప్రస్తుత ఆధునియ ప్రపంచంలో కమ్యూనికేషన్స్ స్కిల్స్ పెంపొందించుకోవడం ద్వారా ఉపాధి త్వరగా పొందవచ్చని యంగ్‌మైండ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు వాకాడ వెంకటరమణ(చిన్న)పేర్కొన్నారు. గాంధీభవన్‌లో గత నెల అక్టోబర్ రెండో తేదీన జిల్లా కలెక్టర్ ప్రారంభించిన ఉన్నతి స్కిల్‌సెంటర్ మొదటి బ్యాచ్ విద్యార్థుల వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వాకాడ వెంకటరమణ మాట్లాడుతూ పదో తరగతి ఆపైన ఉత్తీర్ణులు లేదా ఉత్తీర్ణత కాని వారు ఈ సెంటర్ ద్వారా కంప్యూటర్ స్కిల్స్‌తో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకుని ఉపాధి పొందవచ్చన్నారు. మొదటి బ్యాచ్ ద్వారా 22 మందికి ఉపాధి రావడం సంతోషమని, ఈ నెల 11వ తేదీ నుంచిప్రారంభమయ్యే బ్యాచ్‌కు పూర్తిస్థాయిలో నమోదు కావడం సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజర్ కదలి రేణుశ్రీ, బీవీ రావు, నూకల భానుమతి, రామకృష్ణ, దీపిక, శ్రీలేఖలు తదితరులు పాల్గొన్నారు.

## పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆదిత్య యూనివర్సిటీ కులపతి నల్లమిల్లి శేషారెడ్డి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రముఖ రచయిత ర్యాలీ ప్రసాద్ రచించిన ఘన చరిత్ర రెడ్లు సుగుణశీలురు భూమంచి రెడ్లు పుస్తకాన్ని ఆదిత్య వర్సిటీ కులపతి నల్లమిల్లి శేషారెడ్డి ఆవిష్కరించారు. కాకినాడ శ్రీనగర్ తన కార్యాలయంలో శనివారం పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. రాజకీయ విద్యా వ్యాపార కళారంగాల్లో స్ఫూర్తిదాయకంగా నిలిచిన రెడ్ల చరిత్రను అందరూ చదువుకునేందుకు వీలైన భాషలో రూపొందించడం సంతోషమన్నారు. రచయిత ర్యాలీ ప్రసాద్ మాట్లాడుతూ శతాబ్ద కాలం నుంచి తెలుగుజాతికి రెడ్డి ప్రముఖులు అనేక రంగాలలో ఎనలేని సేవలు అందించారని, వారి కృషి రేపటి తరాలకు అందించాలనే ఈ పుస్తకం రచించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘ అధ్యక్షుడు నల్లమిల్లి బుచ్చిరెడ్డి, కార్యదర్శి ద్వారంపూడి శ్రీనివాసరెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘ సభ్యులు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

## రేపు వైఎస్సార్ సీపీ సమావేశం

కాకినాడ: వైఎస్సార్‌సీపీ కాకినాడ సిటీ నియోజకవర్గ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశాన్ని ఈ నెల 11వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు పార్టీ నగరాధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న తెలిపారు. స్థానిక డి కన్వెన్షన్ హాలులో జరిగే ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, కాకినాడ సిటీ కో-ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పాల్గొని దిశా నిర్దేశం చేస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశానికి విధిగా హాజరుకావాలని ఆమె కోరారు.

## కాకినాడ కేంద్రంగా పీపుల్స్ వరల్డ్ కమిషన్

- సంస్థ జాతీయ కన్వీనరు బొలిశెట్టి సత్యనారాయణ
- శ్రీకిరణ్ కంటి ఆస్పత్రిలో తొలి సమావేశం


సమావేశంలో చర్చిస్తున్న పీపుల్స్ వరల్డ్ కమిషన్ సభ్యులు

కాకినాడ రూరల్: కాకినాడ కేంద్రం (రాయుడుపాలెం)గా పీపుల్స్ వరల్డ్ కమిషన్ ఆన్ డ్రాఫ్ట్ అండ్ ఫ్లడ్ మేనేజ్‌మెంట్‌పై పనిచేస్తుందని ఇందుకు కార్యాచరణ జరుగుతున్నట్టు సంస్థ జాతీయ కన్వీనరు బొలిశెట్టి సత్యనారాయణ పేర్కొన్నారు. పెనుమర్తి వద్ద శ్రీకిరణ్ కంటి ఆస్పత్రిలో పీపుల్స్ వరల్డ్ కమిషన్ ముఖ్య సలహాదారు పద్మశ్రీ డాక్టరు సంకురాత్రి చంద్రశేఖర్ అధ్యక్షతన జిల్లా కన్వీనరు పెసింగి ఆదినారాయణ నిర్వహించారు. కాకినాడ-సామర్లకోట ఉప్పుటేరు కెనాల్ ప్రక్షాళన, ఓం భవనం ప్రగతి, ఎంఎస్ఎన్ చారిటీస్ పరిరక్షణ, శాంత్రి ఆశ్రమం అభికృద్ధి, తదితర వాటిపై చర్చించారు. సంబంధిత అంశాలపై నాలుగు కమిటీలను జిల్లా ప్రతినిధులతో నియమించారు. ప్రతి నెలా జిల్లా కమిటీ సమావేశం నిర్వహించాలని తీర్మానించారు. జిల్లా చాప్టర్ అధ్యక్షుడిగా డాక్టరు సంకురాత్రి చంద్రశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆదినారాయణ, ఉపాధ్యక్షుడిగా లక్కరాజు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా చీకట్ల కిరణ్‌కుమార్, కార్యదర్శిగా దూసర్లపూడి రమణరాజు, కోశాధికారిగా వినోద్‌కుమార్, సభ్యులుగా చిలుకూరి రాంకుమార్ తదితరులను ఎన్నుకున్నారు.

## గర్భిణులకు వైద్య పరీక్షలు తప్పనిసరి


కరపలో గర్భిణులకు పండ్లు అందజేస్తున్న అలయన్స్ క్లబ్ ప్రతినిధులు, డాక్టర్ శ్రీనివాసనాయక్

కరప: గర్భిణులు ప్రతినెల వైద్య పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సలహాల మేరకు పోషకాహారం తీసుకోవాలని డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్ సూచించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభయాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ఆయన వైద్య పరీక్షలు చేసి, సూచనలు చేశారు. కరప పీహెచ్‌సీ పరిధిలోని 11వ ఆరోగ్య ఉపకేంద్రాల ఏఎన్ఎంలు గర్భిణులను పీహెచ్‌సీకి తీసుకురాగా డాక్టర్ శ్రీనివాస్‌నాయక్ పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్‌పర్సన్ అలై డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, అలయన్స్‌క్లబ్ ఆఫ్ కాకినాడ శ్రీపద్మారామ్ క్లబ్ అధ్యక్షుడు పెంకే శివకుమార్, అలయన్స్ గవర్నర్ అలైవనుం శ్రీనివాసరావులు పీహెచ్‌సీ డాక్టర్ శ్రీనివాస్‌నాయక్‌తో కలిసి పండ్లు, బిస్కట్లను గర్భిణులకు అందజేశారు. గైనికాలజిస్ట్ డాక్టర్ పి.శ్రావ్య, సీహెచ్‌ఓ వై.రత్నకుమారి, సిబ్బంది కె.రాజగోపాల్, వి.సత్యనారాయణ, వీవీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. వేళంగి పీహెచ్‌సీలో గర్భిణులకు డాక్టర్ ఎంకే సౌజన్య వైద్యపరీక్షలు నిర్వహించి, తీసుకోవాల్సి జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

## మోకాలి మార్పిడి శస్త్రచికిత్సపై అవగాహన


జీజీహెచ్ ఓటీలో మోకాలి మార్పిడి శస్త్రచికిత్స నిర్వహిస్తున్న డాక్టర్ నరేంద్రరెడ్డి, జీజీహెచ్ వైద్యులు

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లో మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సపై గుంటూరుకు చెందిన ప్రముఖ నీ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బుసిరెడ్డి నరేంద్రరెడ్డి ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఆసుపత్రి ఆర్థోపెడిక్ నిపుణులకు లోతైన అవగాహన కల్పించారని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి తెలిపారు. ఈ మేరకు, శనివారం రాత్రి ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థోపెడిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ ఆధ్వర్యంలో డాక్టర్ నరేంద్రరెడ్డి మోకాల మార్పిడి శస్త్ర చికిత్స విధానాలలో చోటు చేసుకున్న అధునాతన మార్పులను ప్రత్యక్షంగా వివరించారన్నారు. అనంతరం వయసు రీత్యా వచ్చే మోకాలు అరుగుదలకు సంబంధించిన కారణాలు, నివారణ మార్గాలు, చికిత్సలో వచ్చిన నూతన మార్పులు తదితర అంశాలపై ఆర్థోపెడిక్ డిపార్ట్‌మెంట్‌లో అవగాహన కల్పించారన్నారు. బోన్స్ మోడల్ మీద మోకాలి మార్పిడి చేసే చికిత్సా విధానాన్ని మెరిల్ కంపెనీ సౌజన్యంతో సమగ్రంగా వివరించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ పార్థసారథి, డాక్టర్ జీఎస్ ముఖర్జీ, డాక్టర్ వై.నాగేశ్వరరావు, డాక్టర్ బీఎస్ఎస్ వెంకటేశ్వర్లు, డాక్టర్ అనీల్‌బాబు, డాక్టర్ ఆదిత్య కృష్ణ, డాక్టర్ దక్షిణామూర్తి సహా అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీ వైద్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సాంకేతికతను పెంపొందించుకోవాలి


వర్క్‌షాపులో పాల్గొన్న ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

గండేపల్లి: విద్యార్థులు సాంకేతికతను పెంపొందించుకోవాలని ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పి. కృష్ణారావు సూచించారు. మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ, నెట్‌వర్కింగ్‌పై మూడు రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించారు. చివరిరోజు శనివారం ముగింపు వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సైబర్ సెక్యూరిటీ, నెట్ వర్కింగ్ వ్యవస్థలోని వివిధ ప్రక్రియలను, ప్రాజెక్టులు చేయుటకు అనుసరించాల్సిన ప్రణాళికలను విద్యార్థులు అనుభవపూర్వకంగా నేర్చుకున్నట్టు తెలిపారు. మరో ముఖ్య అతిథి స్పైప్రో సెక్యూరిటీ సొల్యూషన్స్ సీఈఓ చైతన్యరాణి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు పెంపొందించుకోవడం ద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు, కె.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఎం.సతీష్, జి.నరేష్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


### పోస్టల్ ఐపీపీబీ ఖాతాలు సద్వినియోగం చేసుకోవాలి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ)మ్యాపింగ్‌లో ఆధార్ అనుసంధానం లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదని పోస్టల్ సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పోస్టాఫీసు ద్వారా ఐపీపీబీ ఖాతాలు ప్రారంభించి ఆధార్ అనుసంధానం చేస్తున్నామని, కాకినాడ డివిజన్‌లో ఉన్న కాకినాడ, సామర్లకోట ప్రధాన పోస్టాఫీసులతో పాటు 54 సబ్‌పోస్టాఫీసు, 283 బ్రాంచ్ పోస్టాఫీసులో సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### ఉత్తమ ఉపాధ్యాయులుగా నలుగురి ఎంపిక

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసిన జాబితాలో కాకినాడ జిల్లాకు సంబంధించి నలుగురు ఉపాధ్యాయులు అర్హత సాధించారు. ఉపాధ్యాయులు బావిశెట్టి లక్ష్మీనారాయణ (ఎస్‌ఏ, సోషల్)తామరాడ ఉన్నత పాఠశాల, ఎం.శ్రీనివాస్ వినీల్ (ఎస్‌ఏ, పీఎస్) కాండ్రేగుల ఉన్నత పాఠశాల, ఎం.గంగారామ్ (ఎస్‌ఏ, తెలుగు)రేచర్లపేట హైస్కూల్, ఎం.సూర్యభాస్కర్(ఎస్‌ఏ ఇంగ్లీష్) గాంధీనగర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఆర్‌జేడీ నాగమణి, డీఈఓ పిల్లి రమేష్ అభినందించారు.

### సినిమాలు



| | |
|---|---|
| ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్: | లక్కీ భాస్కర్, అమరన్, బఘీర, సింగం ఆగైన్ |
| దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్: | భూల్ భులయ్యా-3, లక్కీ భాస్కర్, అమరన్, బఘీర |
| లక్ష్మీ: | క |
| సత్యగౌరి: | లక్కీ భాస్కర్ |
| తిరుమల: | బఘీర |
| సిఅండ్‌సీ1: | అమరన్ |
| సీఅండ్‌సీ2: | క |
| శ్రీప్రియ: | లక్కీ భాస్కర్ |
| పద్మప్రియ: | దేవర |
| సూర్య1(వాకలపూడి): | లక్కీ భాస్కర్ |